క్లుప్తంగా

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

హిరమండలం: చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం వల్ల ఎలాంటి ఆరోగ్య ఇబ్బందులు ఉండవని మండలంలోని జగన్నాథపురం ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం ఎ.సురేష్ అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు బుధవారం వ్యాధి నిరోధక టీకాలు వేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వంట పాత్రల పంపిణీ



వంట పాత్రలు అందజేస్తున్న సర్పంచ్ కృష్ణవేణి

కొత్తూరు: కొత్తూరు పంచాయతీ పరిధిలోని మూడు ప్రాథమిక పాఠశాలల్లోని మధ్యాహ్నం భోజనం పథకం వంట ఏజెన్సీలకు ప్రభుత్వం అందజేసిన వంట పాత్రలను స్థానిక సర్పంచ్ పడాల కృష్ణవేణి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యారంగానికి సీఎం అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ సభ్యులు ఉన్నారు.

వరి కోతలు ప్రారంభం



తురకపేట వద్ద వరి చేను కోస్తున్న యంత్రం

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు గ్రామాల్లో ఖరీఫ్ వరి చేను కోతలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది జూలై మొదటి వారంలోనే వరి వెదలు వేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో కోతలు చేపడుతున్నారు. మండలంలోని తురకపేట, దబ్బపాడు, వాడవలస, మిరియాపల్లి, లక్ష్మీనర్సుపేట, కృష్ణాపురం తదితర గ్రామాల్లో యంత్రాల ద్వారా కోతలు చేస్తున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

కొత్తూరు: ఎరువులు, పురుగు మందులు అధిక రేట్లుకు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తీసుకుంటామని స్థానిక వ్యవసాయశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. కొత్తూరులోని పలు ఎరువులు, పురుగు మందులు షాపులను బుధవారం తనిఖీ చేశారు. ఎరువుల నమూనాలు సేకరించి తాడేపల్లిలోని పరిశోధన కేంద్రానికి పంపించారు. కాలం చెల్లిన పురుగు మందులు, నకిలీ ఎరువులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎరువులు అక్రమంగా నిల్వ చేస్తే డీలర్ షిప్ రద్దుకు సిఫార్స్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో వ్యవసాయ విస్తరణ అధికారి మాధవరావు ఉన్నారు.

శరవేగంగా రైల్వే ట్రాక్ పనులు



ట్రాక్ పనులు చేస్తున్న దృశ్యం

పాతపట్నం: మండలంలోని గంగువాడ సమీపంలోని రైల్వే గేటు వద్ద ట్రాక్ పనులను రైల్వే ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో బీసీఎం, డేయోమెట్రిక్ యంత్రాలతో బుధవారం యుద్ధ ప్రతిపాదికన చేపట్టారు. ఉదయం 6 గంటలకే పాతపట్నం-టిక్కలి రహదారిలో ఉన్న రైల్వే గేటును పూర్తిస్థాయిలో మూసివేశారు. ట్రాక్ పనులు పూర్తయిన వెంటనే గేటు తీశారు. పనులు చేపట్టడంతో ట్రాఫిక్‌ను టిక్కలి నుంచి తెంబూరు, పెద్దలక్ష్మీపురం మీదుగా సారవకోటకు మళ్లించారు. ముందుగానే ట్రాఫిక్‌కు అంతరాయం ఉంటుందని రైల్వే అధికారులు తెలియజేయడంతో వాహనదారులు ఇటువైపు ఎవరూ రాలేదు.

ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలి

హిరమండలం: ఇంటి పన్నుల వసూలు వేగవంతం చేయాలని టిక్కలి డివిజన్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఇంటి పన్ను చెల్లించటం వల్ల యజమానులకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈఓపీ ఆర్డీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు



ఆమదాలవలస రూరల్: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం

అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం చేయడంతోనే ఆంధ్ర రాష్ట్రం అవతరించిందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఆమదాలవలస మండలంలోని కొర్లకోట గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ సమావేశానికి హాజరయ్యారు. ముందుగా అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ రఘురాజు, లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు. అలాగే ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లోని పలుచోట్ల అమరజీవి విగ్రహాలు, చిత్రపటాల వద్ద నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న హెచ్ఎం వైకుంఠరావు



పాతపట్నం: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఆమదాలవలస: రైల్వే స్టేషన్ కూడలి వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవిసుధాకర్



మెళియాపుట్టి: ఎంపీడీఓ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



సారవకోట: అవలింగి జేబీటీ పాఠశాలలో తెలుగు తల్లి, పొట్టి శ్రీరాములు వేషధారణల్లో విద్యార్థులు



ఆమదాలవలస: కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలవేస్తున్న ఆర్య వైశ్య సంఘం సభ్యులు



కొత్తూరు: పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గడపగడపకూ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని కోమర్తి సచివాలయం పరిధిలోని కోమర్తి, కోమర్తి కాలనీ, పసరవానిపేట, లకిమేర గ్రామాల్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పేదలు, మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. రాజకీయాలు, కులాలు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ నాలుగున్నరేళ్లలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత కేవలం సీఎం జగన్‌కే దక్కిందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మేలు చేస్తున్నట్లు వివరించారు. కోమర్తి కాలనీలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి కాలనీ కమిటీ ప్రతినిధి కొల్లి చిన్నబాబు తీసుకువచ్చారు. కోమర్తిని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ సభ్యురాలు చింతు అన్నపూర్ణ, కోమర్తి సర్పంచ్ ఉంగటి చిన్నమ్ముడు, పార్టీ నాయకులు చింతు రామారావు, రాజాపు అప్పన్న, బార్ల వేణుగోపాలరావు, కనపల శేఖర్, సురంగి నర్సింగరావు, పోలాకి నర్సింహమూర్తి, బొబ్బాది ఈశ్వరరావు, మంతిన రాము, ఉంగటి రాజేశ్వరావు, లబ్బ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు దేవాదిలో..

మండలంలోని దేవాది గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు బుధవారం తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

లే అవుట్ల పరిశీలన



జర్రిభద్రలో లేఅవుట్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

మెళియాపుట్టి: మండలంలోని జర్రిభద్ర, మెళియాపుట్టి గ్రామాలలో బుధవారం టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ పర్యటించారు. ప్రైవేట్ లేఅవుట్లను పరిశీలించి డ్రైనేజీలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని యజమానులకు సూచించారు. అధికారులు దీనిపై దృష్టి సారించాలన్నారు. అనంతరం మెళియాపుట్టి మండల కేంద్రంలోని పౌర సరఫరాల శాఖ గోడౌన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ సరోజిని, ఆర్ఐ వైకుంఠరావు ఉన్నారు.

విద్యా సాధన సర్వేపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈఓ రమణ

సారవకోట: రాష్ట్ర విద్యా సాధన సర్వేపై సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 3న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులలో విద్యా సామర్థ్యాలు గుర్తించనున్నారు. ఈ పరీక్షకు 3, 6, 9వ తరగతి విద్యార్థులను ఎంపిక చేసిన పాఠశాలల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు ఎంఈఓ రమణ తెలిపారు. దీని కోసం డిగ్రీ చదువుతున్న విద్యార్థులను పర్యవేక్షకులుగా ఎంపిక చేశామని, వారు కూడా ఈ శిక్షణకు హాజరైనట్లు తెలిపారు. ఈ పరీక్షను పక్కాగా నిర్వహించేందుకు అన్ని సిద్ధం చేశామన్నారు. ఎంఈఓ 2 భూలక్ష్మి, సారవకోట, అలుదు ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు రామకృష్ణ, తంప రామారావు, సీఆర్పీ ప్రసాద్ పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' పరిశీలన



మాట్లాడుతున్న జిల్లా నోడల్ ఆఫీసర్ ప్రసాదరావు

నరసన్నపేట: గ్రామాల్లో ప్రజలకు వైద్యం అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జిల్లా నోడల్ అధికారి ఎం.ప్రసాదరావు అన్నారు. మండలంలోని కంబకాయలో 104 ద్వారా అమలు అవుతున్న ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌ను బుధవారం పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది వచ్చి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్ తదితరులు ఉన్నారు.



హిరమండలం: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం

హిరమండలం: ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందజేయటం జరుగుతుందని డాక్టర్ ఫరూక్ హుస్సేన్ అన్నారు. మండలంలోని చిన్నకోరాడ గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలువురుకి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వైద్య శిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఆరోగ్య భరోసా



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు భరోసాగా నిలిచిందని నేరడి సర్పంచ్ నక్క చిన్నమ్మడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నక్క వెంటరావు అన్నారు. మండలంలోని నేరడి గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రారంభించారు. 457 మందికి మోట్యూరు ఆస్పత్రి వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆరుగురుకి మెరుగైన వైద్యం కోసం గుర్తించినట్లు వైద్యాధికారి రంబాబు తెలిపారు. అధికారులు, వైద్యులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై ఫిర్యాదు

కొత్తూరు: నివగాం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఓటర్ల జాబితాలో ఎటువంటి సవరణలు చేయకుండా పాత ఓటరు జాబితాను కార్యదర్శి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో బీఎల్‌ఓలు ప్రదర్శించారని వైఎస్సార్‌సీపీ నాయకుడు టంకాల రమణరావు బుధవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇంటింటికీ బీఎల్‌ఓలు వెళ్లి ఓటర్ల సర్వే చేసినప్పటకీ.. 2019 నాటి ఓటర్ల జాబితా అందజేసినట్లు తెలిపారు. సర్వేలో తెలిపిన ఒక్క ఓటును కూడా తొలగించలేదని, కొత్త ఓటర్లను నమోదు చేయలేదన్నారు. నూతన ఓటర్ల జాబితా ముంద్రించ లేదన్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకుతీసుకెళ్తే.. ఓటరు జాబితా తహసీల్దార్ కార్యాలయం నుంచి వచ్చిందని తప్పించుకుంటున్నారని రమణ తెలిపారు.

బొర్రంపేటలో 'పొలం బడి'



రైతులతో కలిసి పంటను పరిశీలిస్తున్న ఏఓ లతశ్రీ

ఎల్.ఎన్.పేట: వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని మండల వ్యవసాయ అధికారి పైడి లతశ్రీ అన్నారు. మండలంలోని బొర్రంపేట గ్రామంలో బుధవారం రైతులతో కలిసి పంటలను పరిశీలించారు. ఖరీఫ్ వరి పంట కోత దశకు వచ్చిందన్నారు. కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు అపరాల విత్తనాలు, మొక్కజొన్న విత్తనాలు వేసుకునేందుకు రైతులు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కలిగించారు. కోత కోసిన తరువాత ధాన్యం నిల్వ చేయాలంటే గింజలో తేమ, పొల్లు శాతం పూర్తిగా లేకుండా జాగ్రత్త పడాలన్నారు. అపరాలైన మినుము, పెసర విత్తనాలు వేసుకునే రైతులు విత్తనశుద్ధి చేయాలన్నారు. గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

అఖండ దివ్యనామ సంకీర్తనలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు లింగరాజు

- సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు లింగరాజు

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న సత్యసాయి బాబా మందిరంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వంద గంటల అఖండ దివ్యనామ సంకీర్తనలు బుధవారం ప్రారంభమయ్యాయి. సత్య సాయిబాబా 100వ జన్మదిన వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు ఎన్ని లింగరాజు జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రశాంతి పతాకావిష్కరణను కన్వీనర్ నాగులపల్లి శ్రీనివాసరావు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు లింగరాజు మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు 100 గంటలు అఖండ దివ్యనామ సంకీర్తనలను 33 భజన మండలి ఆధ్వర్యంలో ఆలపించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

హిరమండలం: పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని హిరమండలం కోరాడ ఆర్ఆర్ కాలనీకి చెందిన స్ఫూర్తి సేవా సదన్ జిల్లా కో ఆర్డినేటర్ ఎం.భీష్మ, స్థానిక డాక్టర్ ఎస్.రాకేష్ అన్నారు. మండలంలోని కోరాడలో విద్యార్థులకు బుధవారం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మన ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో పరిసరాలను అంతే పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలన్నారు. పెరటి కూరగాయల సాగుతో ఆర్థికంగా మేలు జరుగుతుందన్నారు. కూరగాయల విత్తనాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, స్థానికులు గంట సహదేవుడు, పల్లవు డానియల్ రాజు పాల్గొన్నారు.

• కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టు మిషన్లు అందజేస్తున్న ఉపహార్ ప్రాజెక్టు ప్రతినిధులు

పొందూరు: మండలంలోని లోలుగు గ్రామంలో ఉపహార్ ప్రాజెక్టు పరిధిలో ఆశా దీవెన టైలరింగ్ సెంటర్ ద్వారా 22 మంది మహిళలకు కుట్టు మిషన్లను బుధవారం పంపిణీ చేశారు. ఆ సంస్థ డైరెక్టర్ రజిత్‌కుమార్ పాణి కుట్టు మిషన్లు అందజేశారు. ఉపహార్ ఏరియా మేనేజర్ బీఎం పాల్, కో ఆర్డినేటర్ ఏసుదాసు, సీఎఫ్ లోపింటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పీకర్ పర్యటన

ఆమదాలవలస రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో స్పీకర్ తమ్మినేని సీతారాం గురువారం పర్యటించనున్నారు. ఈ మేరకు స్పీకర్ కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చింతలపేట, దండేంవలస, బొబ్బిలిపేట గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటి తాగునీటి కుళాయి కార్యక్రమానికి శంకుస్థాపన చేస్తారన్నారు. బొబ్బిలిపేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు.

పొందూరులో..

పొందూరు: మండలంలో గురువారం స్పీకర్ తమ్మినేని సీతారాం పర్యటించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్ బుధవారం తెలిపారు. ధర్మపురం, పిల్లలవలస గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిలు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

జలుమూరు: మండల పరిధిలో అభివృద్ధి పనులు త్వరితిగతిన పూర్తి చేయాలని ఎంపీపీ వాన గోపి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణ, రోడ్లు-భవనాలు, పంచాయతీరాజ్, ఇరిగేషన్, నాడు-నేడు, గ్రామీణ నీటిసరఫరా విభాగం తదితర శాఖల అధికారులతో బుధవారం మాట్లాడారు. మండల పరిధిలో వివిధ స్థాయిలో ఉన్న పనులు వెంటనే పూర్తిచేసి ప్రారంభించాలన్నారు. ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు, ఇంజినీర్లు శ్రీధర్, గోపికృష్ణ, రాజశేఖర్, చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం



స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న కెనరా బ్యాంక్ మేనేజర్ వెంకట అవినాష్

మెళియాపుట్టి: విద్యలో ప్రతిభ కనబరచాలని టెక్కలి కెనరా బ్యాంక్ మేనేజర్ వెంకట అవినాష్ అన్నారు. మండలంలోని గొద్ద గ్రామానికి చెందిన విద్యార్థులకు రూ.22,500 స్కాలర్‌షిప్‌లు బుధవారం అందించారు. పేద విద్యార్థులకు బ్యాంక్ తరపున స్కాలర్‌షిప్‌లు అందిస్తూ.. చదువులో రాణించాలని ప్రోత్సహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే హరిజన, గిరిజన విద్యార్థులైన సుమిత్రసేన బిందు, వాణిశ్రీ, దీక్షిత, (ఒక్కొక్కరికి రూ. 2,500 చొప్పున) యామిని, లిఖిత, ధనంకు (ఒక్కొక్కరికి రూ.5,000) అందించారు. తల్లిదండ్రులు కూడా వారి చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలన్నారు. వీఆర్వో శ్యామ్యూల్, కార్యదర్శి వనజాక్షి ఉన్నారు.